



పి.వి.డి.ఎస్.ప్రకాష్

# నాణేనికి మరో వైపు...

**"డాడీ.. ఇవాళే నా ఎగ్జిబిషన్. ఏర్పాట్లు పూర్తయ్యాయి. టాప్‌మోస్ట్ సెలబ్రెటీలంతా ఈ ఈవెంట్‌కి వస్తున్నారు. నిజానికి..డాడీ కన్నా పెద్ద సెలబ్రెటీ ఎవరున్నారు? సిటీలో పేరుమోసిన ది గ్రేట్ వర్షిత గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ సి.ఎం.డి. మా డాడీ. నువ్వు రానంటే ఈ ప్రోగ్రామ్ కేన్సిల్. సో.. కంపల్సరీ నువ్వొస్తున్నావు....**

**-వర్షిత"**

వర్షిత గ్రూప్.. ఐ.టి. రంగంలో అనతికాలంలోనే ఖండాంతర ఖ్యాతి గడించిన ఇండియన్ కంపెనీ. మాదాపూర్‌లోని కార్పొరేట్ ఆఫీస్ ఛాంబర్‌లో ఆ మధ్యాహ్నం వేళ పది మంది డైరెక్టర్స్‌తో ఇంపార్టెంట్ డిస్కషన్‌లో ఉన్నాడు వర్షిత గ్రూప్ సి.ఎం.డి. సుధీర్.

అదే సమయంలో బీప్‌మంటూ సెల్ మెసేజ్.

డిస్కషన్‌కి చిన్న అంతరాయం.

వర్షిత మెసేజ్. ఇందాకటి మేటరే.

సన్నగా నవ్వి మళ్లీ మూడ్‌లోకి వచ్చేశాడు సుధీర్.

అయితే, డైరెక్టర్స్ ఎవరూ సుధీర్ తేరుకున్నంత త్వరగా మూడ్‌లోకి రాలేకపోయారు.

అవును మరి.. మీటింగ్ స్టార్ట్ అయిన అర గంటలో సుధీర్ అందుకున్న పదో మెసేజ్ అది.

"ఎనీ.. ఇంటపార్టెంట్ మెసేజ్.." చనువు తీసుకుని ఓ డైరెక్టర్ వరుణ్ అడిగాడు.

ఇండస్ట్రీ వ్యవహారాలే తప్ప మిగిలిన విషయాలు, మరీ ముఖ్యంగా పర్సనల్ విషయాలు మాట్లాడేందుకు సుధీర్ ఎప్పుడూ ఇష్టపడడు. ఆయన నైజం తెలిసినవాళ్లెవరూ అలా ప్రశ్నించేందుకు సాహసించరు. అయితే, ఈసారి వరుస మెసేజ్‌లు వస్తుంటే క్యూరియాసిటీ అపుకోలేక వరుణ్ చొరవగా అడిగేశాడు. ఒకవేళ అర్జెంట్ అయితే.. ఈ మీటింగ్ పోస్ట్‌పోన్ చేయొచ్చనే సూచన కూడా క్వశ్చన్‌లో అంతర్లీనంగానే ఉంది. అది గ్రహించిన సుధీర్ నోటితో సమాధానమివ్వలేదు. నిలువుగా తలూపి ఊరుకున్నాడు.

ఆ తర్వాత.. "అబ్రాడ్‌లోని టాప్‌మోస్ట్ అయిదు కంపెనీలు ఇండియన్ మార్కెట్ పెంచుకునేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నాయి. ఆ కంపెనీలు మన వర్షిత సేవలనే ఆశిస్తున్నాయి. కుదిరితే ఇది మంచి డీల్, ఇప్పటికే అబ్రాడ్‌లో ఉనికిని బలంగా చాటుకున్న మన వర్షిత మరింత బలోపేతమవుతుంది. అందుకే.. రెండ్రోజుల్నుంచీ నిద్రాహారాలు మాని ఆ కంపెనీల వివరాలు సేకరించాను. బ్యాక్ గ్రౌండ్, గ్రోత్, ట్రాక్ రికార్డ్ .. ఇలా అన్నీ మీకిచ్చిన ఫైళ్లలో ఉంది. వాటిని పరిశీలించి మీరూ ఓ నిర్ణయానికి వస్తే.." చెబుతున్నాడు సుధీర్.

మళ్లీ బీప్‌మని సెల్ సౌండ్.

వర్షిత మెసేజ్.

"లెవెన్త్ మెసేజ్ సర్" గుర్తు చేశాడు వరుణ్.

'ఎస్.. దిసీజ్ లెవెన్త్ మెసేజ్. లెవెన్త్ అవర్‌లో ఎక్కడ దుమ్మా కొడతాననే భయంతో కాబోలు.. వర్షిత వరుస మెసేజ్‌లు పంపిస్తోంది. మొదటి మెసేజ్ రిసీవ్ చేసుకున్న వెంటనే.. తాను స్పందించాడు. విషయం మరిచిపోలేదనీ.. తప్పక అటెండవుతాననీ మెసేజ్ పెట్టాడు. అయినా.. మెసేజ్‌ల తుఫాన్ సృష్టిస్తోంది..' చిన్నగా నవ్వుకున్నాడు సుధీర్.

'చిన్నప్పట్నుంచీ వర్షిత అంతే. అనుకున్నది సాధిస్తుంది. ఒకవేళ జరగలేదా.. ఇల్లు పీకి పందిరేస్తుంది. వట్టి పెంకిఘటం..' పుత్రికా ప్రేమతో సుధీర్ మనసు పులకింతలకు లోనైంది.

"ఇక, సమాధానం చెప్పేదాకా ఊరుకునేట్లు లేదు" ఛైర్‌లోంచి లేచాడు సుధీర్. తర్వాత డైరెక్టర్స్ వైపు తిరిగి.. "సారీ ఫ్రెండ్స్.. స్మాల్ కాన్వర్‌సేషన్, వన్ మినిట్" అంటూ సుధీర్ సెల్ తీసుకుని ఛాంబర్‌ని అనుకుని ఉన్న రూంలోకి వెళ్లాడు. సుధీర్ ఆ గదిని ఎంతో ఇష్టంగా రూపొందించుకున్నాడు. ఓ రకంగా చెప్పాలంటే అది ఆయన ఆంతరంగిక సమావేశ మందిరం. సి.ఎం.డి.గా ఎంత అలసిపోయినా ఆ గదిలోకి వస్తే చాలు.. ఇట్టే సేదతీరిపోతాడు.

స్విచ్ ఆన్ చేస్తే బాలమురళీ, బాలు, లత, ఆశా..వాణీ జయరాం గాంధర్వ గానాలు. గదంతా పరుచుకునే శీతల పవనాలు సుధీర్‌కి ఎంతో ఊరట కలిగిస్తాయి.

అంతేకాదు.. ఓ పక్క అమర్చిన అద్దాల నుంచీ దృష్టి సారిస్తే.. విశాలమైన ఇండస్ట్రీ ఆవరణ కనిపిస్తుంది. దూరంగా కనిపించే గేటు.. అక్కడ చిన్న షెల్టర్‌లో డేగకళ్లతో పహారా కాసే సెక్యూరిటీ సిబ్బంది.. గేటు నుంచీ లోపలికి వస్తుంటే.. దారికిరుపక్కలా క్రమశిక్షణగల సైనికుల్లా నిలుచునే ఎత్తయిన అశోక్ వృక్షాలు.. అన్నీ కనిపిస్తాయి. ఒక్కోసారి ఏం తోచని సమయాల్లో అక్కడ నిలుచుని అద్దాల్లోంచి చూడడం అతనికెంతో ఇష్టం. స్వశక్తితో నిర్మించిన ఆ మహా సామ్రాజ్యం ఇంకా తనని విస్తరింపజేయమంటూ సుధీర్‌కి అంతులేని స్ఫూర్తి కలిగిస్తుంటుంది.

వర్షితకు ఫోన్ చేశాడు.

"హాయ్, డాడీ..మెసేజ్‌లు చూసి విసుక్కున్నావా?" ముద్దుగా అడుగుతోంది.

"లేదమ్మా.. విసుక్కోలేదు. అయినా తల్లీ, నీ ఎగ్జిబిషన్‌కి నేనెందుకు రాకుండా ఉంటాన్రా. తప్పకుండా వస్తాను. మన ఫంక్షన్‌కి నువ్వంతలా కోరాలా?" అంటున్నాడు సుధీర్.

"ఊహ తెలిసినప్పట్నుంచీ చూస్తున్నాను డాడీ.. నువ్వొట్టి పని రాక్షసుడివి.. పర్సనల్ ఫంక్షన్లను పట్టించుకోవు. నా పుట్టిన రోజు వేడుకలు, మీ పెళ్లి రోజు సంబరాలు, ఫెస్టివల్స్..వేటికీ అటెండ్‌కావు డాడీ.. అందుకే నీ మీద నాకెపుడూ డౌటే"

"అలా అనకురా. నువ్వెంతో ప్రేమగా సేకరిస్తున్న నాణేల మీదొట్టు. నువ్వు నిర్వహిస్తున్న నాణేల ఎగ్జిబిషన్‌కి నే తప్పక వస్తాను. ఇంపార్టెంట్ మీటింగ్‌లో ఉన్నా మళ్లీ మాట్లాడతా"

"ఓకే.. డాడీ, బై" అంది వర్షిత. తిరిగి ఛాంబర్‌లోకి వెళ్తూ గేటువైపు చూశాడు సుధీర్.


అక్కడ ఓ యువకుడు సెక్యూరిటీ వాళ్లతో గొడవ పడుతున్నాడు. బహుశా, లోనికి రావాలని అతను ప్రయత్నిస్తుంటే అపాయింట్‌మెంట్ లేదని సిబ్బంది అడ్డగించి ఉంటారు.

అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదనిపించి సుధీర్ డిస్కషన్ కంప్లీట్ చేయడానికి ఛాంబర్‌లోకి వెళ్లాడు.

సాయంత్రం అయిపోయింది.

'కూతురు పేరుతో పెట్టుకున్న ఇండస్ట్రీ హిస్టరీలో ఇదో మైలురాయి. మరో కొత్త సెగ్మెంట్‌లోకి వర్షిత జర్నీ స్టార్ట్ కాబోతోంది.. ఇక, కూతురు స్వయంగా

నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌కి వెళ్లాలి' అనుకున్నాడు సుధీర్.



అబ్రాడ్ కంపెనీలకు వర్షిత సేవలందించేందుకు డైరెక్టర్లంతా గ్రీన్ సిగ్నలిచ్చారు. డైరెక్టర్స్ నుంచి సెండాఫ్ తీసుకుని కారు దగ్గరకొచ్చాడు సుధీర్. అప్పటికే కారు డోర్ తీసుకుని డ్రైవర్ వెయిట్ చేస్తున్నాడు.

కారెక్కాడు సుధీర్.

సి.ఎం.డి. కారుని చూసి పరుగుపరుగున వచ్చి గేటు తీశాడు సెక్యూరిటీ గార్డ్.

ఇంతలో గేటు దాటబోతుండగా జరిగిందా సంఘటన.


హఠాత్తుగా ఓ యువకుడు కారుకడ్డం పడ్డాడు.

ఓ నిండు ప్రాణం గాల్లో కలిసేది.

అప్రమత్తంగా సడన్ బ్రేక్ వేసి డ్రైవర్ కాపాడాడు.

అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది ఆ యువకుడని పట్టుకుని కసురుతున్నారు.

ఓ గార్డు సుధీర్ దగ్గరికి వచ్చి "ఈ కుర్రాడితో పెద్ద పరేషానైపోతోంది సార్.. టూడేస్‌గా మన ఇండస్ట్రీ గేట్ పట్టుకుని వేలాడుతున్నాడు. ఎవరో చెప్పడు. మిమ్మల్ని కలవాలంటాడు. అపాయింట్‌మెంట్ లేదంటాడు. బహుశా..జాబ్ కోసమేమో?"



ఆ యువకుడి వైపు చూశాడు సుధీర్.

శుష్కించిపోయిన దేహం.. కళ్లలో పెట్టుకున్న ప్రాణం.. వంటిమీద బట్టలు మట్టికొట్టుకునిపోయాయి. వరద బాధితుడిలా కనిపిస్తున్నాడు.

ఇరవై రెండేళ్ల వయసుంటుందేమో? అయినా ఆ వయసుకి తగ్గ నిగారింపు లేదు.

"ఏం కావాలి?" అడిగాడు సుధీర్.

"టెన్ మినిట్స్ మీతో మాట్లాడాలి సార్"

"ఏ విషయం?"

ఆ యువకుడేదో చెప్పబోతున్నాడు. ఇంతలో సెల్ మోగింది.

వర్షిత.

"డాడీ! ఎక్కడున్నారు?"

"ఆన్‌ది వే.. ఫైవ్ మినిట్స్‌లో అక్కడుంటాను"

"తొందరగా వచ్చేయండీ డాడీ.. కలెక్టర్ మీ కోసం వెయిట్ చేస్తున్నారు"

"ఓకే బేబీ.. వచ్చేస్తున్నాను" చెప్పాడు సుధీర్.

"సార్.. మీరు.. టైమిస్తే.."

"నో టైం! డ్రైవర్. కవీంద్రా ఆడిటోరియం" చెప్పాడు సుధీర్.

కవీంద్రా ఆడిటోరియంలోనే వర్షిత నాణేల ఎగ్జిబిషన్ స్టార్ట్ కాబోతుంది. వర్షితను తలచుకోగానే సుధీర్‌కి ఆనందం వేసింది. నాణేల సేకరణ.. నిజానికి ఖరీదైన హాబీ. వర్షిత చిన్నప్పట్నుంచీ నాణేలను సేకరించేది. ఎక్కడ్నుంచి సంపాదించిందో గానీ.. రెండొందల సంవత్సరాల కిందటి నాణేలను కూడా సేకరించింది. ఆ హాబీని చూసి సుధీర్ ఎంతో సంతోషించేవాడు. ఇండస్ట్రీ పని మీద అబ్రాడ్ వెళ్లొచ్చినప్పుడల్లా నాణేలు తెచ్చి వర్షిత చేతిలో పోసేవాడు. వాటిని చూసుకుని గెంతులేస్తూ మురిసిపోయేది వర్షిత.

'గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాలనే తన ఇంట్రెస్ట్.. ఆ కల తీరాలి..' అనుకున్నాడు సుధీర్.

దుమ్ము రేపుకుంటూ అతివేగంగా, దూరంగా వెళ్లిపోతున్న ఆ కారునీ.. ఆ కారులో సుధీర్‌ని చూస్తూ అక్కడే.. అలా ఉండిపోయాడు ఆ యువకుడు.

ఆ రాత్రి ఎగ్జిబిషన్ ముగించుకుని వర్షితను తీసుకుని కారులో ఇంటికి వెళ్లబోతూ.. ఆ యువకుడిని మళ్లీ చూశాడు సుధీర్.

ఎక్కడో కాదు.. కవీంద్ర ఆడిటోరియం బయట.

"నన్ను కలవాలనుకున్నావ్. కలిశావ్. అసలు

నీవెవరు? నీ పేరేంటి?" అడిగాడు సుధీర్.

"విష్ణు.. విఠల్‌గారి మనవడిని"

"ఏ విఠల్?" సుధీర్‌కి ఆ పేరెక్కడో విన్నట్లనిపించింది.

"అవనిగడ్డ విఠల్..పెద్ద ఇండస్ట్రియలిస్ట్"

'అది ఒకప్పుడు.. ఇపుడు కాదు' అనుకున్నాడు సుధీర్.

ఆ విఠలెవరో అతనికి గుర్తొచ్చింది.

"ఆయన మనవడిని నేను. ఈ రోజు ఇలా రెండు చేతులు చాచి దీనంగా మీ సాయం కోసం వచ్చాను"

"జాబ్ కావాలా?"

"చదువు కావాలి సార్?"

"చదువా?"

"అవును.. నేనింకా చదువుకోవాలి. నా చదువు డిగ్రీ మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి వచ్చింది. అలా మధ్యలో నా చదువు ఆగిపోకూడదు. నేను చదువుకుని అనుకున్న లక్ష్యం చేరుకోవాలి" ఆవేశంగా అతను చెబుతుంటే అతడిలో సుధీర్‌కి సుధీరే కనిపిస్తున్నాడు.

"సార్.. మొన్నటి వరదల్లో అన్నీ కోల్పోయాం. ఆఖరికి ఒక పూట తినేందుకు తిండి కూడా నోచుకోని దుర్భర పరిస్థితిలో పడిపోయాం" ఆ యువకుడు చెబుతున్నాడు.

సుధీర్ అతడినే చూస్తున్నాడు.

అతని కళ్లలో సుళ్లు తిరుగుతున్న కన్నీళ్లలో ఊళ్లకి ఊళ్లు మింగేసిన ఓ నది వరదను చూస్తున్నాడు.

పాతికేళ్ల కిందట ఇలాగే ఓ నది.. ఉగ్రరూపం దాల్చింది. జల విలయం సృష్టించింది. అప్పుడూ ఇలాగే. అచ్చం ఈ యువకుడిలాగే ఒకడు అన్నీ పోయి అనాథలా నిలుచున్నాడు. ఆ అనాథ ఎవరో కాదు!

సుధీరే!

'అవును.. అప్పటి వరద తన జీవితంలో పెను విషాదాన్నే మిగిల్చింది. కన్నవాళ్లని, తోడబుట్టినవాళ్లని దూరం చేసింది. ఇంటికప్పు కూల్చేసింది. ఓ రాత్రికి రాత్రి అన్నీ అందర్నీ కోల్పోయి ఈ లోకంలో అనాథగా మిగిలిపోయాడు. పిడికెడు ముద్ద కోసం కడివెడు కన్నీళ్లు కార్చాడు. ఆఖరికి అడుక్కునేవాడే అయిపోయాడు. ఏ అమ్మ అయినా కనికరించకపోతుందా.. గుప్పెడు అన్నం మెతుకులు రాల్చకపోతుందా? అని ఆశగా ఎదురుచూశాడు. ఆ ప్రళయం.. ఆ విలయం.. ఆ నరకం అనుభవించిన వాళ్లకే అర్థమవుతుంది. ఆకాశం నుంచి విసిరేస్తున్న పులిహోర పొట్లాల కోసం ఆశగా చూడడం.. చేతులు సాచి దీనంగా అడుక్కోవడం... అంతేనా! ఆహార పొట్లాల కోసం ప్రపంచ యుద్ధాలే జరిగేవి. వాటర్ పేకెట్ల కోసం పానిపట్టు సమరాలే జరిగేవి. అక్కడా బలమున్నవాడిదే రాజ్యం.

సుధీర్ ఎరిగిన సంక్షోభాన్నే సుధీర్‌కి వినిపిస్తున్నాడు విష్ణు.

"వరద బీభత్సం నాకు తెలుసు.."

"అవును సార్.. మీకు తెలుసని నాకూ తెలుసు. ఆనాటి వరదల్లో మీరు అభాగ్యుడిలా మిగిలితే మా తాత విఠల్‌గారు మిమ్మల్ని ఆదుకున్నారు. అండగా నిలిచారు. మధ్యలో ఆగిపోయిన మీ చదువును కొనసాగించే ఏర్పాట్లు చేశారు"

'అవును.. ఆ యువకుడు అన్నది నిజమే. విఠల్ గారు ఆదుకోవడం వల్లనే తాను చదువుకున్నాడు. తానింతవాడయ్యాడు. ఇపుడు..పెద్ద ఇండస్ట్రియలిస్ట్‌గా ఇండియాలో పేరు తెచ్చుకున్నాడు..'

ఒక్కసారి గుండెనిండుగా కృతజ్ఞతాభావం ఎగిసిపడింది.

"ఇప్పుడు నేను మీ కాళ్లపై పడి దీనంగా అడుగుతున్నాను. నా చదువుకు సాయం చేయండి. డిగ్రీ పూర్తి చేయనివ్వండి"

ఆ యువకుడు సుధీర్ కాళ్ల మీద పడ్డాడు. వాడి భుజాల మీద చేయి వేసి నెమ్మదిగా పైకి లేపాడు సుధీర్.

"సార్.. సాయం చేస్తారు కదూ. మా నాన్నగారు వద్దంటున్నా మీ సాయం కోసం ఆయనకి తెలీకుండా మీ దగ్గరికి వచ్చాను. మీరు ఆదుకుంటే వరదల్లో సర్వం కోల్పోయిన మాకు కాసింత ఆసరా దొరుకుతుంది. భవిష్యత్‌పై నమ్మకం ఏర్పడుతుంది. సాయం చేస్తారు కదూ"

సుధీర్ ఒక్క క్షణం మౌనం దాల్చాడు. ఏదో చెప్పాలనుకుంటున్నా గుండె గొంతుకలో అడ్డుపడ్డట్లుందేమో చెప్పలేకపోతున్నాడు.

ఆ యువకుడు సుధీర్ సమాధానం కోసం ఆశగా ఎదురుచూస్తున్నాడు.

"ఆనాటి వరదల్లో ఓ రకంగా నేను అదృష్టవంతుడినే. విఠల్‌గారి అండ లభించింది. చదువుకున్నాను"

"అవును సార్! మా తాతగారు నిజంగా గొప్పవారు. ఆయన ఒక్క మిమ్మల్నే కాదు దిక్కు లేని ఎందరినో ఆదుకున్నారు"



## ఆర్తీ ఆశ

*తన సినీకెరీర్ సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆర్తీ అగర్వాల్‌కి ఇంతదాకా కలిసివచ్చింది ఏమీ లేదు. ఆమె నటించిన 'పోసాని జెంటిల్‌మాన్' సినిమా పరాజయాన్ని చవిచూసింది. మరో సినిమా 'నీలవేణి' రిలీజ్ కావలసి వుంది. ఈలోగా ఆమె 'బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం' అనే సినిమాలో రంభగా నటిస్తోంది. రంభ అనగానే కాస్త గ్లామరస్‌గా కనిపించే పాత్ర అని ఎవరైనా ఊహిస్తారు. మరి ఇలాంటి గ్లామరస్ పాత్రని పోషిస్తున్న ఆర్తీ అగర్వాల్‌కి ఆ సినిమా మీద బోలెడు ఆశలున్నాయట. ఆమె ఆశలెంతవరకూ నెరవేరతాయో!*

"అందరికీ అంత పెద్దమనసుండొద్దూ.. మీ తాతగారి లాంటి వాళ్లు నూటికో కోటికో ఉంటారు"

"అవును సార్"

"అయిన వాళ్లకి, కానివాళ్లకి మీ తాతగారు సాయం చేయడం వల్లే మీ నాన్నగారి హయాం వచ్చేసరికే మీ ఆస్తిపాస్తులు పోయాయి. ఉన్న కొద్దో గొప్పో.. ఇప్పుడీ వరదల్లో కొట్టుకుపోయాయి"

సుధీర్ ఏం చెప్పదలచుకున్నాడో విష్ణుకి అర్థం అవుతూనే ఉంది. అయినా, ఎక్కడో చిన్న ఆశ.

"నేను మీ తాతగారిలా అనాథలను పెంచాలనుకోవడం లేదు. ఆస్తులను పెంచుకోవాలనుకుంటున్నాను. అర్థం అయిందనుకుంటా. ఇక, నువ్వు వెళ్లొచ్చు"

స్థాణువే అయ్యాడు విష్ణు.

కాసేపటి తర్వాత తేరుకుని "థాంక్యూ సార్.. మా తాతగారు మాకు నేర్పని బతుకుపాఠం మీరు నాకు నేర్పారు. వస్తా.." కోపంగా వెళ్లిపోబోతూ సడన్‌గా ఓ అమ్మాయిని ఢీకొట్టాడు విష్ణు.

ఆమె... వర్షిత.


★ ★ ★

నెల్లాళ్ల తర్వాత ఓ రోజు.

"వర్షితా.. గిన్నీస్ బుక్ ప్రయత్నాలు ఎంతవరకూ వచ్చాయ్? ఇప్పటికే చాలా దేశాల నాణేలు సేకరించావుగా" అడిగాడు సుధీర్.

"ఇక, ఆ ప్రయత్నాలు చేయడం లేదు డాడీ. హాబీ మారింది"

"అవునా.. ఆ కొత్త హాబీ ఏంటో?"




"గిన్నిస్ బుక్‌లోకి ఎక్కడం కాదు, మనుషుల హృదయాల్లో చోటు సంపాదించుకోవాలనుకుంటున్నా డాడీ. అదే ఇప్పటి నా హాబీ"

సుధీర్ ఏం మాట్లాడలేదు. కూతుర్నే చూస్తున్నాడు. వర్షిత చెబుతోంది. "నిజానికి, ఆ నాణేలు కాలం చెల్లినవి డాడీ"

"దేశదేశాలకు చెందిన నాణేలవి. వాటికి విలువ లేకపోవడమేంటి?"

"నిజానికి వాటి విలువ ఎంతున్నా రోజువారీ కరెన్సీలా మనం యూజ్ చేయలేంగా.. అవసరాలకు అవి ఉపయోగపడవు. అందుకే చిర్రెత్తుకొచ్చింది. కోట్లు కూడబెట్టుకున్నా అవసరానికి వినియోగపడకపోతే ఎలా డాడీ?"

"అంటే.."

"ఏం లేదు.. ఇన్నాళ్లూ కూడబెట్టిన నాణేలకు విలువొచ్చింది. ఓ కోటీశ్వరుడి కొడుకు కొన్ని లక్షలిచ్చి తీసుకుంటున్నాడు. ఇంకే ఆలోచించకుండా ఇచ్చేశాను"

"బేబీ.. నువ్వు చిన్నప్పట్నుంచి ఎంతో కష్టపడి సేకరించిన నాణేలు కదా.. వాటినలా ఎలా ఇచ్చేశావ్?"

"ఎవరికీ పనికిరాని నాణేలు ఎన్ని సంపాదించి ఏ ప్రయోజనం డాడీ? ఇందాకే చెప్పానుగా.. నా హాబీ మారిందని. మనుషుల హృదయాల్లో ఇంత చోటు సంపాదించుకోవడం కన్నా గిన్నీస్ రికార్డ్ గొప్పేం కాదనిపించింది. మనం సృష్టించిన రంగు కాగితాలు మనల్ని శాసించకూడదుగా.. మనం వాటికి బానిసలం కాకూడదుగా"

"అంటే.. ఆ డబ్బేం చేశావ్?"

"పాడు చేయలేదు. నలుగురికీ ఉపయోగపడే పనే చేశాను. బహుశా నే చేసిన పని నీకు నచ్చకపోవచ్చు...ఇంతకీ ఏం చేశానో తెలుసా?"

"చెప్పు"

"విష్ణు.. విష్ణులాటి కొందరి చదువుల కోసం వినియోగిస్తున్నా"

అవాక్కయిన సుధీర్ నోట మాట రాలేదు.

## గౌతమి డైరెక్షన్!

**నిన్నటి** హీరోయిన్ గౌతమి త్వరలోనే దర్శకురాలిగా మారబోతోందని చెన్నయ్ సినీవర్గాల కథనం. దర్శకుడు కె.బాలచందర్ నటించే చిత్రానికి గౌతమి దర్శకత్వం వహించబోతోందిట. ఎంతో కాలంగా తన గురువు బాలచందర్‌తో ఓ సినిమా తీయాలని కమల్‌హాసన్ ఆలోచిస్తున్నాడట. ఇటీవలే బాలచందర్ రెండు చిత్రాల్లో ముఖ్యపాత్రల్ని పోషించడంతో తను కూడా బాలచందర్ ప్రధాన పాత్రగా ఓ సినిమా తీయాలని, దాని దర్శకత్వ బాధ్యత తన సన్నిహితురాలైన గౌతమికి అప్పగించాలని కమల్ భావిస్తున్నాట్ట.

